క్లుప్తంగా

పాండురంగడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో రుక్మిణి సమేత పాండురంగస్వామి

పొదలకూరు : మండలంలోని తాటిపర్తి గ్రామంలో రుక్మిణి సమేత పాండురంగస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు స్వామివారికి పంచామృత అభిషేకం, హోమం, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, మధ్యాహ్నం గిన్నెభిక్ష, గ్రామోత్సవం, సాయంత్రం విశేష పూజలు, రాత్రి స్వామి, అమ్మవారికి కల్యాణం, గ్రామోత్సవం, పండరి భజనలు చేశారు. ఉభయకర్తలుగా లక్కు కృష్ణారెడ్డి–సుబ్బమ్మ, లక్కు హరిబాబురెడ్డి–కృష్ణకుమారి, రామిరెడ్డి సందీప్‌రెడ్డి–ప్రశాంతి దంపతులు వ్యవహరించారు.

చకచకా సైడ్‌డ్రెయిన్ల నిర్మాణం



పులికల్లులో నిర్మించిన సైడ్‌డ్రెయిన్లు

పొదలకూరు : 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంతో గ్రామాల్లోని సమస్యలు వెంటనే పరిష్కారం అవుతున్నాయి. మండలంలోని పులికల్లు గ్రామంలో ఇటీవల మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సైడ్‌డ్రెయిన్లు కావాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కనానాయక్‌ను అంచనాలు వేసి నిర్మించాల్సిందిగా ఆదేశించారు. దీంతో సైడ్‌డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేశారు. సమస్య పరిష్కారం కావడంతో మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

వేగంగా..



డ్రైయినేజీ పనులను పరిశీలిస్తున్న నేతలు

మనుబోలు : మనుబోలులో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. ఇటీవల 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మనుబోలులో పర్యటించిన మంత్రి కాకాణికి స్థానిక అంబేడ్కర్ నగర్ వాసులు మురుగు కాలువ నిర్మించాలని విన్నవించుకున్నారు. గత పాతికేళ్లుగా ప్రధాన రహదారి పక్కన మురుగు కాలువ పూడిపోయి ఉందని, మరమ్మతులు చేపట్టకపోవడంతో మురుగు నీరు సమీపంలోని ఇళ్ల మధ్య వస్తోందని, తాము ఇబ్బందులు పడుతున్నామని వారు కాకాణికి మొరపెట్టుకున్నారు. దీనిపై స్పందించిన కాకాణి వెంటనే మురుగు కాలువ నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పనులను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి సోమవారం పరిశీలించారు.

ఉంగరాలతో ఉడాయింపు

నెల్లూరు(క్రైమ్): బంగారు ఉంగరాలతో వ్యక్తి ఉడాయించిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. సండే మార్కెట్ ప్రాంతానికి చెందిన భరత్‌కుమార్‌జైన్ ఆచారివీధిలో శాంతి జ్యువెలరీస్‌ను నిర్వహిస్తున్నారు. ఈ నెల మూడున ఓ గుర్తుతెలియని వ్యక్తి షాపునకు వచ్చి రూ.47 వేలకు రెండు బంగారు ఉంగరాలను కొనుగోలు చేశారు. దీనికి సంబంధించిన నగదును నెట్ బ్యాంకింగ్ ద్వారా పంపానని చెప్పారు. అయితే నగదు షాపు ఖాతాలో ఎంతకీ జమకాకపోవడంతో విషయాన్ని ఆయనకు సిబ్బంది చెప్పారు. నెట్ బ్యాంకింగ్ స్లోగా ఉందని, కొద్దిసేపటికి వస్తుందంటూ వారిని మాటల్లో దించి దుండగుడు అక్కడి నుంచి జారుకున్నారు. దుకాణ సిబ్బంది అతని కోసం గాలించినా ప్రయోజనం లభించలేదు. ఈ మేరకు చిన్నబజార్ పోలీసులకు భరత్‌జైన్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబు ఆదేశాల మేరకు ఎస్సై హనీఫ్, సిబ్బంది ఘటన స్థలాన్ని పరిశీలించారు. సీసీ ఫుటేజీల్లో నిందితుడ్ని గుర్తించి అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు ఇదే తరహాలో గూడూరులోనూ నేరాలకు పాల్పడ్డారని వెల్లడైంది. దీంతో గూడూరు పోలీసులకు సైతం సమాచారం అందించారు.

ఆధునిక సాగు.. లాభాలు బాగు

సాధారణంగా రైతులు నారుపోసి వరిపంటను సాగు చేస్తారు. అయితే ఈ విధానంలో అనేక ఒడిదొడుకులు ఎదురవుతుండడంతో నేరుగా దుక్కిలోనే వరి విత్తనాలు చల్లి నీరుపెట్టి వరిపంటను సాగు చేస్తున్నారు. తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులు భావిస్తున్నారు. దీంతో పాటు కొందరు మినుములో అంతర్‌పంటలుగా కందిని పండించి లాభాలు గడిస్తున్నారు.

- విత్తనాలు చల్లి వరిసాగు
- 20 రోజుల ముందే దిగుబడి
- మేలు చేస్తున్న అంతర్‌పంటలు

పొదలకూరు : వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకు రైతులు ఆధునిక వ్యవసాయం చేస్తున్నారు. ఇందువల్ల పెట్టుబడులు తగ్గడంతో పాటు నష్టాలను పూడ్చుకునే వెసులుబాటు కలుగుతోంది. మండలంలో పెన్నార్ డెల్టా ప్రాంతంలో రైతులు వరిసాగులో ఆధునిక పద్ధతులు పాటించి దిగుబడులు సాధిస్తుండగా, మెట్టప్రాంతానికి చెందిన రైతులు మినుములో అంతర్‌పంటగా కందిని సాగు చేసి లాభాల బాట పడుతున్నారు. కల్యాణపురం గ్రామంలో ప్రయోగాత్మకంగా మినుములో అంతర్‌పంటగా కంది సాగు చేపట్టి విజయవంతంగా దిగుబడి సాధించనున్నారు.

విత్తనాలు చల్లి వరిసాగు

మండలంలోని తాటిపర్తి గ్రామంలో 20 రోజుల ముందే వరికోతలు ప్రారంభమయ్యాయి. గ్రామంలో కొందరు రైతులు వరినాట్లు వేయకుండా విత్తనాలను నేరుగా చల్లడం వల్ల సమయం కలిసి వచ్చింది. దిగుబడి ఎకరానికి ఒక పుట్టి తగ్గినా వ్యయంతో పోల్చిచూస్తే పెద్దగా నష్టం రావడం లేదని రైతులు అంటున్నారు. రెండేళ్లుగా కొందరు ఈ తరహాలోనే వరిపంటను సాగు చేస్తున్నారు. మరికొందరు డ్రమ్ సీడర్స్‌లో నాట్లు లేకుండా విత్తనాలు విత్తారు. సీడర్‌తో వరిపంట సాగు చేయడం వల్ల చల్లకంతో పోల్చి చూస్తే అరపుట్టి అదనంగా దిగుబడి అవుతున్నాయి. వ్యవసాయంలో మార్పులను రైతులు కోరుకోవడంతో పాటు సమయం, కూలీలు తదితర వ్యయాలను తగ్గించుకునేందుకు వీలు కలిగింది. సాధారణ వ్యవసాయం అయితే మరో 20 రోజుల తర్వాత వరికోతలు ప్రారంభం అవుతాయి. విత్తనాలు చల్లడం వల్ల ఎకరానికి రూ.5 వేల వరకు పెట్టుబడులు తగ్గుతున్నట్లు రైతులు తెలిపారు. సాధారణ వ్యవసాయంలో భాగంగా వరిపంట సాగుకు ఎకరానికి రూ.25,000 ఖర్చు చేయాల్సి వస్తుంది. విత్తనాలు చల్లడం వల్ల రూ.20 వేలు సరిపోతుందని, నాట్లు వేసే కూలీలకు ఎకరానికి డిమాండ్‌ను బట్టి రూ.4,500 నుంచి రూ.5 వేల వరకు ఇవ్వాల్సి వస్తోంది.

ప్రయోగాత్మకంగా అంతర్‌పంట

సుమారు 30 ఎకరాల్లో ఏఓ సూచన మేరకు రైతు దయాకర్‌రెడ్డి ప్రయోగాత్మకంగా మినుములో అంతర్‌పంటగా కందిని సాగు చేశారు. మూడు మాసాలకు మినుము కోతకు రాగా కంది మార్చి చివరి నాటికి అదనంగా మరో మూడుమాసాలకు కోతకు వస్తుంది. అయితే మినుము రైతు ఆశించిన స్థాయిలో దిగుబడి కాకపోయినా.. కంది ఆశించిన స్థాయిలో దిగుబడి కానుండడంతో రైతు లాభాల పొందే అవకాశం ఉంది. ఈ అంతర్ పంటల సాగు వల్ల మెట్టభూములు ఉన్న రైతులు అపరాలసాగులో నష్టపోకుండా వ్యవసాయం చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. రైతు దయాకర్‌రెడ్డి అపరాలసాగులో భాగంగా మినుము ఎకరానికి రెండు బస్తాలే దిగుబడి అయ్యాయి. ఇందువల్ల నష్టం వాటిల్లగా అదే పొలంలో అంతర్‌పంటగా కంది సాగు చేయడం వల్ల నష్టాన్ని పూడ్చుకుని ఫలసాయం పొందుతున్నారు. కంది ఎకరానికి 4 బస్తాల దిగుబడి అయితే మార్కెట్లో కంది క్వింటాళ్ల ఒక్కటింటికి రూ.7 వేల వరకు ధర పలుకుతోంది. కంది పంట కోసం రైతు ప్రత్యేకంగా వ్యయం చేసింది కూడా ఏమీ లేదు.



తాటిపర్తిలో చల్లిన వరివిత్తనాల ద్వారా పండిన పంటను నూర్పిడి చేస్తున్న వ్యవసాయ కూలి



మినుములో అంతర్‌పంటగా వేసిన కందిని పరిశీలిస్తున్న ఏఓ వాసు

అంతర్‌పంట వల్ల నష్టం లేదు



కంది అంతర్‌పంటగా సాగు చేయడం వల్ల మినుము దిగుబడిలో వచ్చిన నష్టాన్ని పూడ్చుకునేందుకు అవకాశం కలిగింది. కంది పంట దిగుబడి పెరుగుతుందని ఆశిస్తున్నాను. వ్యవసాయాధికారి సలహాలు, సూచనల మేరకు సాగు చేపట్టాను.

– వెన్నపూస దయాకర్‌రెడ్డి, రైతు, కల్యాణపురం

సాగు పద్ధతుల్లో మార్పులు రావాలి



రైతులు పంటల సాగు పద్ధతుల్లో మార్పు రావాలి. వరి విత్తనాలు చల్లడంలో డ్రమ్‌సీడర్ వల్ల రైతులకు కాలం కలిసి వస్తుంది. అపరాల సాగులో అంతర్ పంటలను సాగు చేసుకుంటే అధిక వర్షాలు కురిసినా రైతులకు నష్టం వాటిల్లదు.

– ఎ.వాసు, ఏఓ, పొదలకూరు.

దామేగుంటలో ఫ్యామిలీ డాక్టర్



కొడవలూరు : మండలంలోని దామేగుంటలో కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఓపీ ద్వారా 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం ఓపీకి రాలేని స్థితిలో ఉన్న ముగ్గురు ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య సూచనలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎస్‌లు బి.పద్మ, పి.శ్రీలత, హెచ్‌ఏలు షఫీ ఉద్దీన్, డీవీ.రమణమ్మ, ఆశా కార్యకర్త కె.భార్గవి పాల్గొన్నారు.

బుచ్చి మీదుగా చిన్నారి స్కేటింగ్

బుచ్చిరెడ్డిపాళెం : తిరుపతి జిల్లా ఏర్పేడులో చిన్నారి ప్రారంభించిన స్కేటింగ్ సోమవారం రాత్రి బుచ్చిరెడ్డిపాళెం మీదుగా సాగింది. తిరుపతికి చెందిన కిశోర్– వాసంతి దంపతుల కుమారుడైన వేదనరసింహ ప్రపంచ రికార్డు లక్ష్యంతో రేణిగుంట, వెంకటగిరి, రాపూరు, ఆత్మకూరు, సంగం మీదుగా స్కేటింగ్ చేపట్టారు. దీంతో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు లేకుండా ఆయా మండలాల పోలీసులు సహకారం అందించారు. బుచ్చిరెడ్డిపాళెం నుంచి కోవూరు, నెల్లూరు మీదుగా గూడూరు వరకు దాదాపు 270 కిలోమీటర్లు మేర స్కేటింగ్ చేయనున్నాట్లు చిన్నారి తెలిపారు.

ప్రజలు బాబును నమ్మే పరిస్థితి లేదు



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజారిటీనే లక్ష్యం
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



హాజరైన నాయకులు

వెంకటాచలం : చంద్రబాబును, టీడీపీని రాష్ట్ర ప్రజలెవరూ నమ్మే పరిస్థితి లేదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చెముడుగుంట వద్ద ఉన్న ప్రిడ్స్ కల్యాణ మండపంలో సర్వేపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులతో సోమవారం మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. తాను రెండు దఫాలు సర్వేపల్లి ఎమ్మెల్యేగా గెలవడంలో పేర్నాటి కృషి చాలా ఉందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఉన్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలుపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలియజేశారు. మూడు జిల్లాల పరిధిలో 34 నియోజకవర్గాల్లో ఓటర్లు ఉండగా, సర్వేపల్లి నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ సాధించే విధంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని సూచించారు.

దిగజారిపోయిన టీడీపీ

మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన బాబు తరువాత ఎవరినీ పట్టించుకోలేదని, దీంతో బాబును ప్రజలు దాదాపు మర్చిపోయారన్నారు. చంద్రబాబు, లోకేశ్ సోషల్ మీడియాలో ప్రచారాలు చేసుకోవడానికే పరిమితమయ్యారన్నారు. వృద్ధులకు సైతం కరపత్రాలు అందించి ఫొటో తీసుకుని ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంగా చెప్పుకుంటూ రోజురోజుకు టీడీపీ దిగజారిపోతుందన్నారు.

మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించండి – పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

తనను మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారని చెప్పారు. సమావేశంలో మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, నాయకులు వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, కొణిదెన మోహన్ నాయుడు, చిల్లకూరు సుధీర్‌రెడ్డి, మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, నెల్లూరు శివప్రసాద్, దాసరి భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

- ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం



జాగ్రత్తలను వివరిస్తున్న ఎంపీడీఓ

కొడవలూరు : వేసవి నేపథ్యంలో వడదెబ్బకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. కొడవలూరు సచివాలయంలో వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులకు వెళ్లే వారు ఉదయం పది గంటల్లోపే ముగించుకోవాలన్నారు. ఎండ తీవ్రంగా ఉన్న సమయంలో బయటకు వెళ్లడం శ్రేయస్కరం కాదన్నారు. ప్రతిఒక్కరూ తాగునీరు అధికంగా తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాలకృష్ణ, వీఓఏలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి అగ్నిమాపక సిలిండర్‌లు



విద్యావనరుల కేంద్రానికి చేరిన అగ్నిమాపక సిలిండర్‌లు

కొడవలూరు : మండల విద్యావనరుల కేంద్రానికి(ఎమ్మార్సీ) 27 అగ్నిమాపక సిలిండర్‌లు సోమవారం సరఫరా చేశారు. వీటిని ఎంఈఓ జి.వసంతకుమారి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ నాడు–నేడు పనులు పూర్తయిన పాఠశాలల్లో అగ్నిమాపక సిలిండర్‌లు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకొందన్నారు. మండలంలో 27 పాఠశాలల్లో నాడు నేడు పనులు పూర్తయినందున మంగళవారం వీటిని పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎంఈఓ వెంట సీఆర్‌పీలు ఎం.దయాకర్, జె.పెంచలరావు ఉన్నారు.

రామాచార్యులకు అవార్డు

తోటపల్లిగూడూరు : వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి, తోటపల్లి గ్రామ వాసి ఈదూరు రామాచార్యులు ఉగాది సువర్ణ కంకణ అవార్డును అందుకున్నారు. సర్ సీవీ రామన్ అకాడమీ సాంస్కృతిక సంస్థ, శ్రీకృష్ణ సేవా సంస్థాన్ సంయుక్తంగా ఆదివారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఈ అవార్డును అందించింది. ఈ క్రమంలో ఈదూరు రామాచార్యుల సేవలకు మెచ్చిన కమిటీ నిర్వాహకులు ఆయన్ను నిరంతర ప్రజాసేవ దురంధర అవార్డుకు ఎంపిక చేశారు. ప్రముఖుల చేతులమీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. దీంతో సోమవారం మండల నాయకులు రామాచార్యులను అభినందించారు.

నాయకులు, కార్యకర్తల కృషి ఎనలేనిది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: వైఎస్సార్‌సీపీకి నాయకులు, కార్యకర్తలే కొండంత బలమని, వారి కృషి ఎనలేనిదని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలో నూతన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావుతో కలిసి ఎమ్మెల్యే ప్రసన్న సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో నాయకులు, కార్యకర్తలు కృషి మరువలేనిదన్నారు. ఇక్కడ ప్రతిరోజు మండల, టౌన్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు అందుబాటులో ఉంటారని తెలిపారు. చిన్న పనులు, సమస్యలు ఉంటే ఇక్కడ సంప్రదించాలన్నారు. పెద్ద సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. చైర్‌పర్సన్, కౌన్సిలర్లు కూడా పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు.

చైర్‌పర్సన్ దంపతులకు అభినందన

బుచ్చి చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, భర్త మోర్ల మురళిని ఎంపీలు, ఎమ్మెల్యేలు అభినందించారు. పార్టీ కార్యాలయానికి అవసరమైన 25 అంకణాల స్థలాన్ని ఇవ్వడం చాలా సంతోషకరమని, ఇతర మండలాల్లో కూడా దాతలు ముందుకు రావాలన్నారు. అలాగే కార్యాలయ నిర్మాణానికి విరాళాలు ఇచ్చిన దాతలను కూడా కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల, టౌన్ అధ్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు కోడూరు మధుసూదన్‌రెడ్డి, ద్వారకానాథ్‌రెడ్డి, పిడుగు మధు, మురళి, భరత్, చీర్ల ప్రసాద్, శ్రీకాంత్‌రెడ్డి, మహేష్, ఎంపీపీ శ్రీనివాసులు, వైస్ చైర్‌పర్సన్లు లలితారెడ్డి, షాహుల్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యం

- ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులైన శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోరారు. మండలంలోని అలగానిపాడు గ్రామానికి చెందిన సర్పంచ్ గండవరపు వివేకానందరెడ్డి నివాసంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలతో సోమవారం సమీక్ష నిర్వహించారు. మండలంలో దాదాపు 1,337 పట్టభద్రులు, 57 ఉపాధ్యాయుల ఓట్లు ఉన్నాయని, ఆయా గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు ప్రతి ఇంటికి వెళ్లి మన పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. జేసీఎస్ మండల కన్వీనర్ కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల లక్ష్మయ్య, నేతలు కొండూరు వెంకటసుబ్బారెడ్డి, రామిరెడ్డి విజయభానురెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పూజలు

అలగానిపాడు గిరిజన కాలనీలో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయక ఆలయ ప్రతిష్ట మహోత్సవాల్లో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొన్నారు. పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణ ఆలయంలో కూడా పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ గండవరపు వివేకానందరెడ్డి, నేతలు పి.అచ్యుత్‌రెడ్డి, పి.శ్రీహరిరెడ్డి, జనార్ధన్, జి.శ్రీనివాసులరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

నేత్రపర్వం.. కల్యాణోత్సవం



స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని చేపడుతున్న అర్చకులు

ఇందుకూరుపేట : బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని ఇందుకూరుపేటలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం సోమవారం రాత్రి నేత్రపర్వంగా సాగింది. ఆలయ అర్చకుడు ఉదయగిరి వెంకట శేషాచార్యులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించి వేదికపై కొలువుదీర్చారు. మంగళ వాయిద్యాల నడుమ వేదపండితుల మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా వేడుకను జరిపారు. అనంతరం గజవాహనోత్సవం ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి పాటూరు వెంకటశేషయ్య పంతులు, కామాక్షమ్మ జ్ఞాపకార్థం కుమారులు ఉభయదాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో అర్చకులు ఉదయగిరి రంగాచార్యులు, నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు. స్వామివారి రథోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.

బాబా మందిరంలో వార్షిక వేడుక



బాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సీఐ

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిర 17వ వార్షికోత్సవం సోమవారం వేడుకగా జరిగింది. వేలాది మంది భక్తుల ప్రత్యేక పూజలు, బాబా నామ సంకీర్తనలతో మందిరం మారుమోగింది. వార్షికోత్సవంలో సేవాసమితి సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు చీమకుర్తి రాజగోపాల్, దామోదరరావు, ఉపకార్యదర్శి తరుగు ప్రభాకర్, సభ్యులు కె.కోటేశ్వరరావు, సుబ్బానాయుడు, లక్కాకుల ఆనందరావు, నున్నా రమేష్, కదిరి పెంచలప్రసాద్, భాస్కర్‌నాయుడు, తుమ్మల శ్రీనివాసులు, బాలకృష్ణ పాల్గొన్నారు.

వేడుకగా గ్రామోత్సవం

శ్రీశిరిడీ సాయి సేవాసమితి సొసైటీ పర్యవేక్షణలో గ్రామోత్సవం వేడుకగా జరిగింది. బాణసంచా, తప్పెట్లు, మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు.

నేత్రదానం



పిచ్చిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : విడవలూరుకు చెందిన మనసేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నేత్రదానం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకుడు దేవళ్ల శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ కోవూరు మండలంలోని పడుగుపాడుకు చెందిన సిద్దారెడ్డి పిచ్చిరెడ్డి (60) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందగా ఆయన కోరిక మేరకు కుటుంబ సభ్యులు పిచ్చిరెడ్డి నేత్రాలను దానం చేశారు. నెల్లూరుకు చెందిన ఎల్‌వీప్రసాద్ ఆస్పత్రి సిబ్బంది లాలేష్, బాలాజీలు నేత్రాలను సేకరించి నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు అందించినట్లు తెలిపారు.

గాయపడిన మహిళ మృతి

నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందారు. నార్త్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. శెట్టిగుంటరోడ్డులోని జీనిగల వీధికి చెందిన సయ్యద్ నాషీరా (52) తన కుమారుడు గఫ్రోస్‌తో కలిసి బైక్‌పై నగరంలోని ఓ హాస్పిటల్‌కు గత నెల 24న బయల్దేరారు. వెంగమాంబ సెంటర్ వద్దకు వచ్చేసరికి బైక్‌కు కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి ఇద్దరూ కిందపడ్డారు. గఫ్రోస్‌కు స్వల్ప గాయాలు కాగా, నాషీరా తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో ఆమెను చేర్పించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కిమ్స్‌లో చేర్పించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ పోలీసులు హాస్పిటల్‌కు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఎస్సై గీతారమ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.